క్లుప్తంగా

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న బౌద్ధ ప్రచారుకుడు రామచంద్ర

మల్కాపురం: మనకు ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలను ఎంత పవిత్రంగా చూసుకుంటే మానవాళి మనుగడ అంత సంతోషంగా ఉంటుందని బౌద్ధ ప్రచారుకుడు రామచంద్ర బౌద్ధ ధర్మ అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. తద్వారా సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయని చెప్పారు.మన స్వార్థం కోసం పచ్చటి చెట్లను నాశనం చేసుకుంటే మన మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి తమ తమ ఇంటి వద్ద మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామాధ్యక్షుడిగా మళ్ల రామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కాళ్ల రామగోవింద్, ప్రధాన కార్యదర్శిగా మళ్ల రమేష్‌గౌరి, సహాయ కార్యదర్శిగా మళ్ల అనిల్‌కుమార్, కోశాధికారిగా కాళ్ల సత్యనారాయణ, తనిఖీదారుడిగా పెంటకోట శివతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే పి.గణబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, జయేంద్రకాలనీలో సుమారు రూ. 20 లక్షల జీవీఎంసీ నిధులతో బీటీ రోడ్లు, రూ. 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ 63వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ, బాబూరావు, ధర్మ, కనకరాజు, నాగరాజు, నరేన్, అజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ నెట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల నెట్‌బాల్ జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ అభినందించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ సురేష్ జ్ఞానవిహార్‌లో జనవరి 3 నుంచి 5 వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పురుషుల విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.గోపీకృష్ణ, ఏయూ వ్యాయామ విద్యా విభాగం గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టించుకోని అధికారులు

ఇబ్బందులు పడుతున్న వాకర్స్



లైట్లు వెలగకపోవడంతో వాకర్స్ అవస్థలు ఇలా

వాకింగ్ పార్కులో

సమస్యల పరుగు

మల్కాపురం: ఆహ్లాదం పంచాల్సిన పార్కులో సమస్యలు తిష్ట వేశాయి. కనీస వసతులతో పాటు నిర్వహణ లేక పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ఫలితంగా వాకింగ్ పార్కుకు వస్తున్న వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద వాకింగ్,సైక్లింగ్ పార్కు ఉంది. ఇక్కడకు మల్కాపురం,శ్రీహరిపురం,నక్కవానిపాలెం తదితర ప్రాంతాల నుంచి రోజూ వంద మందికి పైగా వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళ వస్తుంటారు. పార్కులో ఉన్న విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు రోజూ సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు మాత్రమే వెలుగుతుంటాయి. అయితే ప్రస్తుతం శీతాకాలంలో కావడంతో 6 గంటలు దాటితే గానీ పూర్తిగా వెలుగు రాదు.ఈ సమయంలో కూడా 5 గంటలకే లైట్లు ఆర్పేస్తుండడంతో అంధకారం అలుముకుంటుంది. దీంతో ఆ సమయంలో వాకింగ్‌కు వచ్చే వారు భయపడుతున్నారు. అలాగే పలు మొక్కలు పెంచారు. అయితే కొమ్మలు బాగా పెరిగి వాకింగ్ ట్రాక్‌పైకి రావడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. పార్కు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. నిర్వహణ లేక ఈ పరిస్థితి వచ్చిందని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

కానరాని నిర్వహణ

వాస్తవానికి పారిశుధ్య కార్మికులు పార్కును పరిశుభ్ర పరచాల్సి ఉంది.కానీ వారు శుభ్రం చేయడం లేదని వాకర్స్ ఆరోపిస్తున్నారు. దీంతో చెత్తాచెదారంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి.

ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు కార్యకలాపాలు

ఇది ఇలా ఉంటే ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు. వారు సొమ్ము చేసుకోవడానికి పార్క్ స్థలాన్ని వినియోగించడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు.జీవీఎంసీకి పన్ను అయినా చెల్లించాలి.. లేకపోతే ఉచితంగా శిక్షణ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా పార్కు ఆవరణ

మ్యాన్ హోల్‌ను సరి చేశారు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి దుర్గానగర్‌కి వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. దుర్గానగర్‌లో మ్యాన్‌హోల్‌పై పలకలు విరిగి ప్రమాదకరంగా ఉండేది. అటుగా ప్రయాణం చేసే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 29న 'సాక్షి' దినపత్రికలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ అనే కథనం వెలువడింది. దీంతో సంబంధిత జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. ఈఈ తారా ప్రసన్నరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఏఈ ఉషారాణి పర్యవేక్షణలో వర్క్ సిబ్బందితో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయించారు. అటుగా వెళ్లే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



దుర్గానగర్‌లో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు ఇలా..

వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెత్త తొలగించిన తర్వాత చల్లిచ బ్లీచింగ్



గుల్లలపాలెం మంచినీటి కార్యాలయం వద్ద వ్యర్థాలను తొలగించిన దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 60,61వ వార్డుల పరిధిలో పలు సేవా మార్గాలపై పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం తొలగించారు. రోడ్లపై చెత్తకుప్పలు డంపింగ్ యార్డుల తలపించడంతో సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'మరీ ఇంత చెత్తా' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ సిబ్బంది స్పందించారు. 60వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ తన సిబ్బంది సాయంతో గుల్లలపాలెం మంచినీటి కార్యాలయం వద్ద సేవా మార్గం వద్ద వ్యర్థాలను తొలగించి, ఆ ప్రదేశంలో బ్లీచింగ్‌ను పిచికారీ చేయించారు. అలాగే 61వ వార్డు మల్కాపురం పల్లివీధి సేవా మార్గం వద్ద చెత్తను కూడా తొలగించారు.

న్యూ ఇయర్ జోష్



న్యూ ఇయర్‌కు సన్నాహాలు చేస్తున్న యువత

మల్కాపురం: న్యూ ఇయర్ వేడుకలకు అంతా సిద్ధమవుతున్నారు. 2024కు గుడ్ బై చెప్పి 2025కు స్వాగతం చెప్పడానికి సమాయత్తం అవుతున్నారు. దీనిలో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు స్వీట్ స్టాల్స్,బేకరీలు,రెస్టారెంట్‌లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. ఆయా షాపులకు విద్యుత్ లైట్లు పెట్టి కొనుగోలుదారులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. శ్రీహరిపురం వద్ద గల ఓ స్వీట్ స్టాల్ యజమాని కిలో కేక్ పై రూ.50 తగ్గించనున్నట్టు ఆఫర్ పెట్టారు. నక్కవానిపాలెం వద్ద ఓ రెస్టారెంట్ యజమాని తన వద్ద బిర్యాని కొన్న వారికి ఒక డ్రింక్ బాటిల్ ఫ్రీ అంటూ ఆఫర్ ప్రకటిస్తున్నారు. ఇలా పలువురు వ్యాపారులు తమ వద్ద సామగ్రి అమ్మకాల కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఇది ఇలా ఉంటే పలు షాపుల ముందు ఒక్క రోజు ముందే న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపే విధంగా పెయింటింగ్ చేస్తున్నారు. ఇప్పటికే న్యూ ఇయర్‌కి అవసరమైన పువ్వులు, పండ్లు వ్యాపారులు దిగుమతి చేసుకున్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఎంతో కీలకమైనదని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్, డైరీను సోమవారం ఆవిష్కరించారు. విద్యా సంబంధిత సమాచారంతో పొందుపరిచిన క్యాలెండర్, డైరీ ఉపాధ్యాయులకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, గౌరవ అధ్యక్షుడు అనకాపల్లి పైడిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, కోశాధికారి రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్కసత్యం, రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయం

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు న్యాయం చేయండి
- కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వినతి

మహారాణిపేట: గత నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, వేతనాల చెల్లింపులో ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోండా తాడన్న, బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సమస్యను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి తెచ్చి చర్చించారు. జీతాలు అందక ఉక్కు ఉద్యోగులు అర్థాకలితో బతుకుతున్నారని తెలిపారు. గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్) అనేక ఇబ్బందులు పడుతూ యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీతాలు లేక పిల్లల స్కూలు ఫీజులు, బ్యాంకుల దగ్గర తీసుకున్న లోన్లు కట్టలేక, నిత్యావసర ఖర్చులతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ విషయం మీద జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు నెలల జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వెంటనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమస్యపై నగర పోలీస్ కమిషనర్‌కు, సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.వి.రత్నం, దాసరి పుల్లారావు, ఎల్.వి.రమణ, వెంకట్ రాజు, పరమానంద, బి.సాయి, ఫణీంద్ర బాబు, ఆంజనేయ పాల్గొన్నారు.

మాతృ,శిశు మరణాలు లేకుండా చూడాలి

మహారాణిపేట: జిల్లాలో మాతృ,శిశు మరణాలు లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సోమవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ,శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. చంద్రానగర్, బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండు మాతృ మరణాలు సంభవించాయన్నారు. పెదగంట్యాడ, శొంట్యాం, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మూడు శిశుమరణాలు సంభవించాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి మాతృ,శిశు మరణాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉషాప్రసాద్, గిరిధర్, షర్మిలాకుమారి, శ్రావణ్, ప్రవీణ్, జి.రాజేష్, ఉమావతి, అప్పారావు, ఎన్వీ సమత, త్రినాథరావు, 108 డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఐ.మనోరమ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ జీవీ నిలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వారం రోజులుగా షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి, డీసీపీ కమోడోర్ రాకేష్‌ప్రసాద్, గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హేమంత్ ఖత్రి మాట్లాడుతూ షిప్‌యార్డ్‌కాలనీలో ఉన్న లలిత కళా మందిరం, స్పోర్ట్స్ క్లబ్, క్రీడా మైదానాలు, పార్కులు తదితర వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీలైతే ప్రతి నెలా ఉద్యోగులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించాలని తద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నారు. అందుకు తగిన సహకారం సంస్థ నుంచి ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ఏయూ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఏయూ విద్యార్థి

విశాఖ విద్య: దక్షిణ భారత యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 26 నుంచి 30 వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా జరిగిన యువజనోత్సవాల్లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు. ఏయూ నుంచి 25 మంది విద్యార్థులు 16 విభాగాల పోటీల్లో పాల్గొని పది బహుమతులను గెలుచుకున్నారు. రంగోలిలో జి.దీక్షిత మొదటి స్థానం, క్లే మోడలింగ్‌లో డి.గోపి మూడో స్థానం, కార్టూనింగ్‌లో షేక్ రఫీ 4వ స్థానం, స్పాట్ పెయింటింగ్‌లో పి.గిరిప్రసాద్ ఐదో స్థానం, పోస్టర్ మేకింగ్‌లో జి.రేణుక ఐదో స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ఎ.హేమలత, కె.రేణుక, ఎల్.అశోక్, ఎం.శ్రీను ఐదో స్థానం, మెహందీలో బి.లీలావతి 5వ స్థానం సాధించారు. జాతీయ స్థాయిలో జరిగే యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం ఏయూ అధికారులు అభినందించారు.

సినీ కళాకారులకు అవార్డులు



సినీ కళాకారులకు అవార్డులు అందజేసిన కార్యక్రమంలో ప్రముఖులు

దాబాగార్డెన్స్: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుల కార్యక్రమం సోమవారం దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి సినీ కళాకారులకు వివిధ కేటగిరీలో అవార్డులు అందజేశారు. ఐఎఫ్‌ఎంఏ నేషనల్ సెక్రటరీ పులగం రామచంద్రారెడ్డి, నేషనల్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో జాలాది విజయ, స్టార్ మేకర్ సత్యానంద్, నటుడు అంబటి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. పీఆర్ స్టూడియో డ్యాన్స్ గ్రూప్ పిల్లి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నమ్మ సేవ చారిటబుల్ ట్రస్ట్ పద్మజ క్లాసికల్ డ్యాన్స్, భవ్య సాత్వికల సోలో పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐఎఫ్‌ఎం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.ఆశలత, కార్యదర్శి బాబు నెట్టి, కోశాధికారి మద్దిపల్లి రవళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేశ్వరి, యామిని, మోకాస మహాలక్ష్మి, లక్ష్మీ పూజ, మద్ది మంజీర, రెడ్డి సౌజన్య, మోని, భార్గవి, మూర్తి, డాక్టర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ స్టాఫ్ కాలేజీలో 'స్వచ్ఛ భారత్'

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలోని యూజీసీ అకడమిక్ స్టాఫ్ కాలేజీ(ఎంఎం టీటీసీ) పరిసరాల్లో సోమవారం సంస్థ ఉద్యోగులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కొంత కాలంగా ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తీసి శుభ్రం చేశారు. గతంలో కురిసిన వర్షాలకు తుమ్మ చెట్టు విరిగి రేకుల షెడ్డుపై పడింది. దీన్ని తాళ్లతో కట్టి బయటకు తీశారు. కాలేజీ ఆవరణలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరావు, సీతారామ్, ప్రసాద్, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదం



మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలు చూపుతున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: సీపీఎం విశాఖ జిల్లా మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదించారని జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సీపీఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు ఈ నెల 28, 29న పెందుర్తి సుజాతనగర్‌లో విజయవంతంగా జరిగాయన్నారు. ఈ మేరకు సోమవారం యల్లమ్మతోటలో గల కార్యాలయంలో మీడియా సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి ఆమోదించిన తీర్మానాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, పేదల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి ఉద్యమించాలని తీర్మానించినట్లు చెప్పారు. పంచగ్రామాలు, ఇనాం భూ సమస్య, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తూ సెయిల్‌లో విలీనంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, స్థానిక యువతకు పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సంస్థల్లో కొలువులు కల్పించాలని, జిల్లా గ్రంథాలయాన్ని తక్షణమే నిర్మించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను, యూజర్ చార్జీలు రద్దు చేయాలని, మెట్రో రైలుతోపాటు వాల్తేర్ డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ పనులు ప్రారంభించాలనే తీర్మానాలను జిల్లా మహాసభ ఆమోదించిందన్నారు. ప్రజలను సమీకరించి భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. సామాన్యులపై విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలన్న ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శిగా మరడాన జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులుగా డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, కేఎం శ్రీనివాసరావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావుతోపాటు మరో 16 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారని తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

జగదాంబ: జనవరి ఒకటో తేదీ తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై ప్లాస్టిక్ వ్యాపారులకు సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1 తర్వాత వ్యాపారులు ప్లాస్టిక్‌ను విక్రయిస్తే అపరాధ రుసుము వసూలు చేయడంతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేట్లు, గ్లాసులు, గన్ని బ్యాగ్‌లు విక్రయించాలని సూచించారు. చిరువ్యాపారుల వద్ద నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, వ్యాపారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని హెల్త్ అసిస్టెంట్ల ధర్నా



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో వివిధ తప్పుల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేసి తమను ఆదుకోవాలని జిల్లా హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ జీవో ప్రకారం 2002లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్‌ఏ) ఉద్యోగాల్లో చేరామని, జిల్లాలో ప్రస్తుతం 148 మంది పనిచేస్తున్నారని, ఇటీవల తమను ఉద్యోగాల నుంచి తొలగించారని అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. పోస్టుల రోస్టర్ కూడా సక్రమంగా చూపించలేదని, 148 మంది ఉంటే, వీరికి ఆర్‌వోఆర్ రోస్టర్ సక్రమంగా వేయలేదని, దీని వల్ల ఎంతో మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని ప్రకటన చేయాలి

అగనంపూడి: వచ్చేనెల 8న విశాఖ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్రమోదీ ఆ సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ వైఎస్ చైర్మన్ జె.అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో 1418 రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాగించడానికి అవసరమైన ముడి ఖనిజాలు కేటాయించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలనుకుంటే సెయిల్‌లో విలీనం చేసి రాష్ట్ర అభివృద్ధికి పరోక్షంగా తోడ్పాటు అందించాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు నగిరెడ్డి రామారావు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.